క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన అవసరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఐవీ రావు

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని, ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని సీనియర్ వైద్యులు ఐవీ రావు సూచించారు. స్థానిక వీవీఎస్ విద్యా సంస్థలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యాన ఆరోగ్య భారతి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ వయస్సు ఆధారంగా ఆరోగ్యంలో మార్పులు వస్తాయని, దానికి అనుగుణంగా ఆహార నియామాలు పాటించాలని సూచించారు. ఎక్కువగా నీరు తాగాలని, ఉప్పు, నూనెలను తక్కువగా తీసుకోవాలన్నారు. కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గుండె, మూత్రపిండాలు, కేన్సర్ వైద్య నిపుణులు చంద్రమౌళీ, హర్షవర్ధన్, ప్రచోట్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్‌లు అప్పాజీ, విష్ణు, సేవా భారతి ప్రముఖ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మ ఆలయానికి భూమి పూజ



ఆలయానికి భూమి పూజ చేసిన నేతల వెంకటలక్ష్మి, హరిబాబు

సామర్లకోట: స్థానిక 13వ వార్డు గొల్లపేటలో సత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భూమి పూజ జరిగింది. అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు దంపతులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. హిందూ ధర్మప్రచార కమిటీ కన్వీనర్ జీవీకే మోహనరావు, ప్రచార కమిటీ సభ్యులు మార్ని రాంబాబు, కె.అర్జునరావు, గణేష్, 20వ వార్డు కౌన్సిలర్ చిట్టుమాని రాఘవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి జాతర



ఆకట్టుకున్న కాళికా వేషధారణ

సామర్లకోట: మండలంలోని నవర గ్రామంలో ఉన్న కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో వివిధ రకాల వేషధారణలతో జాతర ఉత్సాహంగా సాగింది. కాళికాదేవి వేషధారణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు సైతం సాయిబాబా, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు వేషాలు వేసి అందరినీ అలరించారు. కనకదుర్గ ఆలయం నుంచి గ్రామంలోని పలు వీధుల్లో జాతర సాగింది. ఈ జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్, నవర ఎంపీటీసీ కేశవరపు వీరప్రభాకర రావు ప్రారంభించారు.

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా రవి



కొత్తపల్లి: ఎమ్మార్పీస్ మండలాధ్యక్షుడిగా మోర్త రవి నియమితులయ్యారు. రాష్ట్ర కార్యవర్గం తనను మండలాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఆదివారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆశయాలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్సై వర్గీకరణతో పాటు మాదిగల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. రవికి పలువురు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుల నియామకం ?

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా ఇద్దరిని నియమించినట్టు సమాచారం. వీరిలో ఒకరైన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఎస్.గాంధీరెడ్డి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మరొకరిని కూడా ప్రత్యేక ఆహ్వానితునిగా నియమించినట్టు తెలిసింది.

ఎట్టకేలకు కోట్లమ్మ చెరువుకు మోక్షం

- ముగ్గురు ఎమ్మెల్యేలు
- హామీలకే పరిమితం
- సుందరంగా తయారు కానున్న వైనం



కోట్లమ్మ చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్ పనులు



కోట్లమ్మ చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులు

సామర్లకోట: దీర్ఘకాలంగా సమస్యగా ఉన్న కోట్లమ్మ చెరువుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రభుత్వం నుంచి అమృతధార నిధులు మంజూరు కావడంతో కోట్లమ్మ చెరువును అభివృద్ధి చేయాలని మున్సిపల్ పాలక మండలి నిర్ణయించింది. పట్టణంలో పేద ప్రజలు నివసించే ప్రాంతంలో ఉన్న కోట్లమ్మ చెరువు ఆ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చేది. ఈ చెరువు ఎర్ర నేలతో ఉండటం వలన నీరు ఎంతో రుచిగా ఉండేది. క్రమేపీ చెరువును అధికారులు నిర్లక్ష్యం చేయడంతో తుప్పలు పెరిగిపోయి బహిరంగ మరుగుదొడ్డిగా మారిపోయింది. చెరువులో చుక్క నీరు లేకుండా పోయింది. 15 ఏళ్లుగా కోట్లమ్మ చెరువు అభివృద్ధిపై ముగ్గురు ఎమ్మెల్యేలు తోట గోపాలకృష్ణ, పంతం గాంధీమోహన్, నిమ్మకాయల చినరాజప్ప ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. కాకినాడ రోడ్డులో సెక్రామ్ పవర్ ప్లాంటుకు చెందిన చెరువు పనులు జరిగే సమయంలో పైపులైను ధ్వంసం అయింది. దాంతో చెరువులో నీరులేకపోవడంతో అది పాడైపోయింది.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ముందుకు..

పట్టణ పరిధిలో ఎంతో కీలకమైన కోట్లమ్మ చెరువు అభివృద్ధిలో వివక్ష చూపుతున్నారని 10 ఏళ్లుగా కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేసినా ఎవరికీ చీమ కుట్టినట్టు లేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత తెలుగుదేశం నాయకులు హామీలుగా వదలి వేసిన నీలమ్మ చెరువు, కోట్లమ్మ చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా ఇప్పటికే నీలమ్మ చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా కోట్లమ్మ చెరువును కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రతీ మున్సిపాలిటీలోను ఒక చెరువును అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో పాలక మండలి సభ్యులు కోట్లమ్మ చెరువును ఎంపిక చేశారు. సుమారు రూ.98 లక్షలతో చెరువు అభివృద్ధిలో భాగంగా చెరువులోని పూడికతీయడంతో పాటు గట్టు పటిష్టం చేసి చెరువు చుట్టూ మొక్కలు నాటి పార్కింగ్ ప్రదేశంగా, వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తారు.

హామీలకే పరిమితమైన అభివృద్ధి



గత తెలుగుదేశం పాలకులు పట్టణంలో ఎంతో ముఖ్యమైన నీలమ్మచెరువు, కోట్లమ్మ చెరువుల అభివృద్ధి ప్రకటనలకే పరిమితం చేశారు. మేము అధికారంలోకి వచ్చిన తరువాత ఈ చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. దీనిలో భాగంగా మున్సిపాలిటీకి మంజూరు అయిన నిధులతో నీలమ్మ చెరువు అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అమృతధార నిధులతో కోట్లమ్మ చెరువు అభివృద్ధి జరుగుతుంది.

– ఊబా జాన్‌మోజెస్, మున్సిపల్ వైస్ చైర్మన్, సామర్లకోట

గ్రీన్ పార్కు సంస్థ ద్వారా చెరువు పనులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీ నుంచి ఒక చెరువు, కార్పొరేషన్ల నుంచి మూడు చెరువులను అభివృద్ధి చేయడానికి నిర్ణయించింది. దీనిలో భాగంగా మున్సిపాలిటీ నుంచి కోట్లమ్మ చెరువును ఎంపిక చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా గ్రీన్ పార్కు సంస్థ ఆధ్వర్యంలో చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్‌తో పాటు, పార్కు నిర్మాణం అయ్యే అవకాశం ఉంది.

– హుసేన్, మున్సిపల్ డీఈ, సామర్లకోట.

'పది'లమైన జ్ఞాపకాలతో..



రాపర్తిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పిఠాపురం: ఎప్పుడో 20 ఏళ్ల క్రితం వారంతా ఒకే పాఠశాలలో చదువుకున్నారు. వేర్వేరు గ్రామాలు, వేర్వేరు కులాలు, మతాలు అయినా వారంతా స్నేహితులుగా మారిపోయారు. ఐదేళ్ల పాటు ఒకే పాఠశాలలో విద్యనభ్యసించి వారు పదో తరగతి తరువాత ఎవరిదారిన వారు వెళ్లి పోయారు. వారిలో కొందరి స్నేహాలు కొనసాగినా అందరూ మాత్రం ఎప్పుడూ కలుసుకోలేదు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఆదివారం రాపర్తిలో ఒక్కచోట కలిశారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పిఠాపురం మండలం రాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001–02 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కువైట్, ఇతర దేశాలతో పాటు రాష్ట్రంలోని వివిధ చోట్ల ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. తమ చిన్న నాటి స్నేహితులను కలుసుకోడానికి సుదూర ప్రాంతాల నుంచి రావడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఇక నుంచి ఏటా ఇలా కలుసుకోవాలని, తమ బ్యాచ్‌లో ఎవరికి కష్టం వచ్చినా అందరు సహకరించుకోవాలని నిర్ణయించుకున్నారు.

పుష్కర కాలువకు ఇసుక మేటల గండం

- వర్షాలతో మెట్ట రైతులకు ఇక్కట్లు
- మెట్టలో పూర్తి కాని వరినాట్లు



పేరుకుపోయిన ఇసుక మేటను తొలగిస్తున్న కూలీలు

పెద్దాపురం: ఇటీవల కురిసిన అరకొర వర్షాలకే వాలుతిమ్మాపురం నుంచి కొండపల్లి వెళ్లే పుష్కర కాలువ ఇసుక మేటలతో పూడుకుపోయింది. దీంతో కాలువలో నీటి ప్రవాహం ఆగిపోయి ఐదు గ్రామాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని వాలుతిమ్మాపురం, రాయభూపాలపట్నం, చినబ్రహ్మదేవం, కొండపల్లితో పాటు రంగంపేట మండలంలోని మర్రిపూడి గ్రామానికి నీరందించడానికి 13 కిలో మీటర్లు పొడవునా పుష్కర కాలువను తవ్వారు. గండేపల్లి మండలంలోని యర్రంపాలెం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా ఈ కాలువకు నీరు వదిలారు. అయితే వాలుతిమ్మాపురం, సూరంపాలెం మెట్టల నుంచి వచ్చిన ఇసుక మేటలతో కాలువ చాలా వరకు పూడుకుపోయింది. ఇప్పటికే నాలుగుసార్లు యంత్రాలతోనూ, పెద్ద ఎత్తున కూలీలతో రైతులే ఇసుక మేటలను తొలగించినప్పటికీ వరుస వర్షాలతో మేట మళ్లీ వచ్చి పూడుకుపోతోంది. దీంతో దిగువ పొలాలకు నీరు వెళ్లక మెట్టలో వరి నాట్లు పూర్తి చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. కాలువకు 50 మీటర్ల పొడవునా రక్షణ గోడ నిర్మిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. సత్వరమే ఇసుక మేటల తొలగింపు చర్యలు చేపట్టాలని రైతులు పుట్టా సోమన్న చౌదరి, సాల్మన్‌రాజు, కంటిపూడి విష్ణు, సత్యనారాయణ కోరుతున్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగర తీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో వాహనాలను క్రమబద్ధీకరించారు.

నవరస కళారంగ సేవలు ఆదర్శనీయం



కార్యక్రమాన్ని ప్రారంభించిన పరిషత్ కార్యదర్శి గోపాల్, జానకీరామ్ చౌదరి తదితరులు



గమ్యస్థానాల వైపు నాటికలో ఒక సన్నివేశం

ఆకట్టుకొన్న సాంస్కృతిక ప్రదర్శనలు

కాకినాడ కల్చరల్: నవరస నాటక పరిషత్ చేస్తోన్న కళారంగ సేవలు ఆదర్శనీయని బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన నవరస నాటక పరిషత్ 59వ వార్షికోత్సవాన్ని గట్టి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పరిషత్ వ్యవస్థాపకుడు దివంగత ఎస్ఎస్ఆర్‌కే గురుప్రసాద్ కళా ప్రాంగణాన్ని ముందుగా ప్రారంభించారు. గురుప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తన తండ్రి గురుప్రసాద్ ఆశయ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పరిషత్ కార్యదర్శి గోపాల్ అన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని పరిషత్ అధ్యక్షుడు గరికిపర్తి నమఃశ్శివాయ అన్నారు. యువతను కళారంగంలో భాగస్వాములను చేయాలని అప్పుడే కళారంగాలకు పూర్వవైభవం చేకూరుతుందని పరిషత్ ఉపాధ్యక్షుడు మార్ని జానకీరామ్ చౌదరి అన్నారు. నాటక పరిషత్ చేస్తున్న కళారంగ సేవలను సంఘసేవకులు వి.విశ్వేశ్వరావు తదితర వక్తలు కొనియాడారు. అనంతరం నాట్య భారతి నృత్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. ప్రేమానందం బృదం ఏర్పాటు చేసిన 'పద్మవ్యూహం' బుర్రకథ ప్రేక్షకులను అలరించింది. శ్రీసాయి ఆర్ట్స్ సమర్పణలో ప్రదర్శించిన 'గమ్యస్థానాల వైపు' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. శ్రీసాయి కార్తిక్ క్రియేషన్స్ సమర్పణలో ప్రదర్శించిన 'ఎడారిలో వాన చినుకు' నాటిక ఆకట్టుకొంది. దివంగత ఎస్ఎస్ఆర్‌కే గురుప్రసాద్ జీవిత సాఫల్య పురస్కారం రంగస్థల నటుడు టి.గాలిబ్‌కు ప్రదానం చేసి సత్కరించారు. తురగా సూర్యారావు, మూర్తి పాల్గొన్నారు.

ఆస్వాదన సాహితీ గుబాళింపులు

- కొత్త తరానికి భాషా సౌందర్యాన్ని అందిస్తున్న సంస్థ
- 18 సంవత్సరాలుగా పలు సాహిత్య సేవలు



కాశీభట్ల సత్యనారాయణ రచించిన రుద్రం గ్రంథావిష్కరణ చేస్తున్న దివంగత దంటు సూర్యారావు తదితరులు (ఫైల్)



సురభారతీ సౌరభం సాహిత్య సదస్సులో పాల్గొన్న వేంకటసత్యనరసింహ శాస్త్రి, దుర్గాప్రసాద్ తదితరులు (ఫైల్)

కాకినాడ కల్చరల్: సాహితీ గుబాళింపులను కొత్తతరానికి అందిస్తున్న ఖ్యాతిని ఆస్వాదన సాహితీ సమితి (ప్రాచీన, ఆధునిక సంస్కృతాంధ్ర సాహిత్య సాంస్కృతిక వేదిక) దక్కించుకుంది. సాహితీవేత్తలు గొట్టుముక్కల వెంకట నరసింహశాస్త్రి వ్యవస్థాపక అధ్యక్షులుగాను, నేతి వెంకటరమణమూర్తి గౌరవ అధ్యక్షులుగాను, గోదావరి శ్రీరామకృష్ణమూర్తి, చిక్కాల ఆనంతలక్ష్మి, గిడుగు వేంకటాచలపతి సభ్యులుగాను 2004లో సమితిని ఏర్పాటు చేశారు. ఆధునిక నాగరికత, పరభాషా వ్యామోహం, దుష్ప్రచారాల కారణంగా అణగారుతున్న స్వభాష(తెలుగు)ను రక్షించాలనే గొప్ప ఆశయంతో సమితిని ఏర్పాటు చేశారు. ఆశయానికి అనుగుణంగా సమితి 18 సంవత్సరాల నుంచి సేవలను అందజేస్తూ సాహిత్యాభిమానుల మన్ననలు పొందుతోంది.

ఎనలేని సాహిత్యసేవ

భాషా ప్రయోజనాలను, సౌందర్యాన్ని కొత్త తరానికి అందించడంలో విశేష కృషి చేస్తోంది. యువకులను వక్తలుగా, కవులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. బాలబాలికలతో పద్యాల కంఠస్థం చేయించి పోటీలు నిర్వహించడం, మంచి పుస్తకాల పఠనం అలవాటు చేయడం సమితి చేస్తోంది. ప్రాచీనాంధ్ర కార్యక్రమాలపై ప్రసంగాలు, అష్టావధానం నిర్వహించింది. వాల్మీకి, మహాకవి కాళిదాసు వంటి కవుల జయంతులు నిర్వహిస్తోంది. కొండేపూడి తాతబ్బాయి రచించిన 'అమ్మ శతకం, నార్ల చిరంజీవి రచించిన 'తెలుగుపూలు' వేమన, సుమతి శతక పద్యపోటీలు నిర్వహించింది. గౌరవ అధ్యక్షులుగా స్వర్గీయ దంటు సూర్యారావు, సమన్వయ కర్తగా కొరుప్రోలు గౌరినాయుడు, కార్యదర్శిగా కాకరపర్తి దుర్గాప్రసాద్ కమిటీగా 2009లో ఏర్పడిన సమితి మరిన్ని సాహిత్యసేవలతో దూసుకుపోతోంది. ఆకెళ్ళ బాలభాను, బులుసు అపర్ణ తదితరులతో అష్టావధానం కార్యక్రమాలు నిర్వహించారు. 'తెలుగు వెలుగు జిలుగులు' పేరుతో కావ్యపరంపర సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. గిడుగు రచించిన గీతారత్నములు, నరసింహశాస్త్రి రచించిన మధుర మాధవం, పొదరిల్లు, వేణుగీతి వంటి పుస్తకావిష్కరణలు చేసింది. వర్ధమాన రచయితలు రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తూ సమితి ప్రోత్సాహం అందజేస్తూ సాహిత్యం పట్ల యువతలో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేస్తోంది. 2013లో 'ఆంధ్ర సాహిత్య పరిషత్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొని వివిధ సాహిత్యసదస్సులు నిర్వహించింది. ప్రస్తుతం స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా జగన్నాథశాస్త్రి కల్యాణ మంటపం సమావేశపు మందిరంలో జూలై 30 నుంచి డిసెంబర్ 24వ తేది వరకు ప్రతీ ఆదివారం బమ్మెర పోతన రచించిన శ్రీమదాంధ్ర మహా భాగవతంపై ప్రసంగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.


తెలుగు భాష పరిరక్షణ



తెలుగును పరిరక్షించే ఉన్నత ఆశయంతో నాటి తెలుగు భాషాభిమానులు సహకారంతో ఆస్వాదన సాహితీ సమితి ఏర్పాటు చేశాం. సమితి ఆశించిన ఫలితాలు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మరిన్ని సాహిత్యసేవలు చేసేందుకు సమితి సభ్యులు సిద్ధంగా ఉన్నారు.

గొట్టుముక్కల వేంకట సత్యనరసింహశాస్త్రి, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, కాకినాడ

యువతకు ప్రోత్సాహం



సాహిత్యం ప్రక్రియల్లో యువతను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాం. మంచి కవులను, రచయితలను సమాజానికి పరిచయం చేసేందుకు కృషి జరుగుతోంది. యువతీయువకులను సాహిత్యంలో భాగస్వాములను చేసేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. చిన్నప్పటి నుంచి భాషాభిమానం పెంపొందించేందుకు పద్యపోటీలు నిర్వహిస్తున్నాం.

కొరుప్రోలు గౌరినాయుడు, సమితి ఉపాధ్యక్షుడు

నేడు సామర్లకోట కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గత నెలలో వాయిదా పడిన అజెండాలోని 46 అంశాలతో పాటు ఈ నెలలో పట్టణ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించిన మరో ఐదు అంశాలతో అజెండా తయారు చేశామన్నారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని కోరారు.

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రేపు

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు అధ్యక్షతన జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

దొరబాబును సత్కరించిన పార్టీ నాయకులు



దొరబాబును సత్కరించిన మర్లావ పార్టీ నాయకులు

సామర్లకోట: స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం పెద్దాపురం పార్టీ నాయకులు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును సత్కరించారు. పెద్దాపురం మండలం మర్లావ గ్రామానికి చెందిన కామన రామకృష్ణకు జిల్లా పార్టీ కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా స్థానం లభించింది. దాంతో ఈ పదవి రావడానికి దవులూరి దొరబాబు కారణమని ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, విష్ణుచక్రం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సోమేశ్వరరావు



సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఆటో స్టాండ్ యూనియన్‌కు ఆదివారం ఎన్నిక జరిగింది. స్థానిక రైల్వే కల్యాణ మంటపంలో పెద్దాపురం స్టాండ్ శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ ఎన్నిక జరిగింది. పోటీలో రెండు వర్గాలు ఉండటంతో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన 177 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ ఎన్నికలో డి.సోమేశ్వర రావు అధ్యక్షునిగా ఎన్నిక అయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.శ్రీనివాసు, వి.వెంకటరమణ ఉపాధ్యక్షుడిగా, టి.దుర్గాప్రసాద్ కార్యదర్శిగా, జె.సురేంద్ర కృష్ణ సహాయ కార్యదర్శిగా, ఎం. అర్జునరావు కోశాధికారిగా ఎన్నికయ్యారు. టి.శ్రీను, ఆర్.శ్రీనివాసు, బి.జగదీష్, జి.దుర్గాప్రసాద్, ఎస్.రమేష్, బి. నాని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాజశ్యామలాదేవిగా వనదుర్గ అమ్మవారు



రాజశ్యామలాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారు రాజశ్యామల దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పండితులు నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, బాల, కన్య, సువాసినీ పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చామర్తి కన్నబాబు, నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి, అంగర సతీష్, చెల్లపిళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివపదం కళాపోటీలు ప్రారంభం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో ఋషి పీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 'శివపదం' పేరుతో ఏర్పాటు చేసిన కళాపోటీలను ఆదివారం సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ట్రస్టు కన్వీనర్ చావలి రామ్మూర్తి మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ పోటీలు మంగళవారం వరకు జరుగుతాయన్నారు. మొదటి రోజున విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 మంది జూనియర్స్, 30 మంది సీనియర్స్ పాల్గొని సామవేదం షణ్ముక శర్మ స్వరకల్పన చేసిన కీర్తనలు ఆలపించి అలరించారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సంగీత విద్వాంసులు ఆకొండ శ్రీనివాసరాజరావు, కేవీ బ్రహ్మానందం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సోమవారం నృత్యప్రదర్శన పోటీలు నిర్వహిస్తామ ని నిర్వాహకులు తెలిపారు. రామచంద్రరావు, ట్రస్టు సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.